సాక్షి వరంగల్

ఆదివారం | 29 | అక్టోబర్ | 2023



16 కిలోల గంజాయి పట్టివేత

నెక్కొండలో 16 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హథీరాం నాయక్ తెలిపారు.

- 12లో▸



దళారులకు చెక్

పత్తి కొనుగోలు కేంద్రాల్లో దళారులకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పలు నిబంధనలు విధించింది.

- 12లో▸

గరిష్టం/కనిష్టం

33^0 / 16^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అగ్నివీర్‌కు సాయిబన్నీ ఎంపిక



నెక్కొండ: మండల కేంద్రానికి చెందిన అంబాల సాయిబన్నీ ఇండియన్ నేవీ అగ్నివీర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని రామయ్య డిఫెన్స్ అకాడమీలో ఆయన డిగ్రీతోపాటు డిఫెన్స్ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో గత జూలైలో ఇండియన్ నేవీ అగ్నివీర్ నిర్వహించిన సీనియర్ సెకండరీ రిక్రూట్ (ఎస్ఎస్ఆర్) జాతీయ స్థాయి పరీక్షలో ప్రతిభచాటి ఉద్యోగం సాధించాడు. నవంబర్ 15 ఐఎన్ఎస్ చిల్కాకు సాయిబన్నీ హాజరు కావాలి. ఈ సందర్భంగా ఆయనను నెక్కొండ సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి, రామయ్య డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్లు రామయ్య, శ్రీనివాస్, గౌడ సంఘం నాయకులు కక్కెర్ల నాగయ్య, అంబాల రాంగోపాల్ తదితరులు సన్మానించారు.

బస్సు ఢీకొని మహిళ మృతి

గీసుకొండ: నర్సంపేట నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతిచెందిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కొనాయమాకుల పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో వరంగల్–నర్సంపేట రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని మహిళను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందిందని గీసుకొండ ఎస్సై శ్వేత తెలిపారు. మృతురాలు సుమారు 60 ఏళ్ల వయస్సు, బురఖా ధరించి ఉండటంతో ముస్లిం మహిళగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 8712685031 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆమె కోరారు.

క్రికెట్ మైదానం ప్రారంభం



గీసుకొండ: దేశంలో క్రికెట్ వరల్డ్ కప్ టోర్నీ జరుగుతున్న క్రమంలో గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్లలో క్రికెట్ మైదానాన్ని సిద్ధం చేశారు. బరుపాటి నాగరాజు, వనపర్తి ప్రణీత్ ఐదు ఎకరాల భూమిని ఐదేళ్లపాటు కౌలుకు తీసుకుని ఏర్పాటు చేసిన మైదానాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుంకరి శివ, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్ శనివారం ప్రారంభించారు. నాయకులు గజ్జి రాజు, ముక్కెర సతీష్, కందుల శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్, బరుపటి సదానందం, గొల్లపల్లి రఘు, చింతం రాజు, ఉజ్వల్‌కుమార్, శ్రవణ్‌కుమార్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

మంగళవారిపేటలో నగదు పట్టివేత



ఖానాపురం: అనుమతి లేకుండా తీసుకెళ్తున్న నగదును మంగళవారిపేటలో పోలీసులు శనివారం పట్టుకున్నారు. జిల్లా సరిహద్దు కావడంతో చెక్‌పోస్టు ఏర్పాటు చేయగా సీఐ కిషన్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇల్లందుకు చెందిన కల్తి రమేష్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.2లక్షల 3వేల 800 తీసుకెళ్తున్నాడు. దీంతో సీఐ కిషన్ స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై మాధవ్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను విజయవంతం చేయాలి



కాళోజీ సెంటర్: స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (సీఏస్)ను విజయవంతం చేయాలని డీఈఓ వాసంతి సూచించారు. నవంబర్ 3 నుంచి జిల్లా వ్యాప్తంగా 3, 6, 9 తరగతి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసే ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. వరంగల్‌లోని తాళ్ల పద్మావతి హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వేలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల అభ్యసన ప్రగతి సామర్థ్యాల వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి మాలోత్ సారయ్య, డీసీఈబీ కార్యదర్శి జి.కృష్ణమూర్తి, ఏపీఓలు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయం సాధ్యమేనా?



వర్ధన్నపేట కాంగ్రెస్‌లో కేఆర్ నాగరాజుకు పెద్ద టాస్క్

- ఆశావహులు, ముఖ్యులను కలుపుకొని పోవాల్సిందే
- ఇన్నాళ్లు పార్టీని నడిపించిన నమిండ్ల శ్రీనివాస్‌ను మెప్పించాలి
- ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు దంపతుల మార్గదర్శనం తీసుకోవాల్సిందే
- ప్రత్యర్థి పార్టీల్లోని అసంతృప్త నాయకులను లాగాలి
- రిటైర్డ్ సీపీ కష్టపడితేనే ఫలితమంటున్న శ్రేణులు

సాక్షి, వరంగల్: వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జోష్ అందుకుంటుందా.. ఎవరు ఊహించని విధంగా అసలు అభ్యర్థే కరువయ్యారని అనుకున్న తరుణంలో కాంగ్రెస్ నుంచి దాదాపు 18 మంది ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అంతా వడబోసి చివరకు మాజీ పోలీసు అధికారి కేఆర్ నాగరాజుకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇన్నాళ్లు టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన కేఆర్ నాగరాజు ఇప్పుడు పార్టీ శ్రేణులను ఒక్క తాటిపైకి తీసుకొచ్చి ముందుకు తీసుకెళ్లడం పెద్ద టాస్క్‌గా కనిపిస్తోంది. ఎందుకంటే ఇక్కడి నుంచి ఎక్కువ మంది టికెట్ ఆశించారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, విద్యావేత్త జన్ను పరంజ్యోతితోపాటు వర్ధన్నపేటలో ఎక్కువగా ప్రభావితం చేసే సీనియర్ నాయకుడు వరద రాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యకర్తలను మెప్పించి ముందుకెళ్లాలి. పార్టీకి జీవం లేని సమయంలో రెండేళ్ల నుంచి వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాత్ సే హాత్ జోడో యాత్ర సమయంలో అన్నీ తానై ముందుండి నడిపించారు. ఇలా పార్టీ బలోపేతానికి కృషిచేసిన ఆయనకు ఎమ్మెల్యే టికెట్ రాలేదు. నిరాశతో ఉన్నా ఇప్పటికీ బహిరంగంగా ఎక్కడా అసంతృప్తి వ్యక్తం చేయలేదు. నమిండ్ల మౌనం వహిస్తున్నాడంటే ఇంకా ఏమైనా ప్రణాళిక రచిస్తున్నాడా.. లేదా కేఆర్ నాగరాజు సమన్వయం చేయడం ద్వారా కలిసి పనిచేసే అవకాశం ఉందా అని ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ జోరుగా సాగుతోంది. ఈక్రమంలో వరద రాజేశ్వర్‌రావును శనివారం కేఆర్ నాగరాజు బృందం కలిసింది. ఆ సమయంలో అందరినీ సమన్వయం చేసుకుంటేనే ఇక్కడ కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని, ఎవరిని నిర్లక్ష్యం చేయవద్దని ఆయనతో అన్నట్లు తెలిసింది. ఇప్పటికే ఊరూరా ఫ్లెక్సీలు కట్టించి ప్రచారం చేసిన విద్యావేత్త పరంజ్యోతి కూడా నాగరాజుకు పూర్తిస్థాయిలో సహకరిస్తారా అన్నది కూడా ప్రశ్నార్థకంగా ఉంది. ఏదేమైనా ఇన్నాళ్లు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరని తేలక గందరగోళంలో ఉన్న పార్టీ శ్రేణులకు.. కేఆర్ నాగరాజును అభ్యర్థిగా ప్రకటించడంతో స్పష్టత వచ్చింది. దీంతో కాంగ్రెస్ నాయకులను ఎన్నికల ప్రచారంలో ముందుకు తీసుకెళ్తూనే.. ప్రత్యర్థి పార్టీల నుంచి వచ్చే రాజకీయ సవాళ్లు, ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ముందుకెళ్లడం, ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉందన్న వాదన వినిపిస్తోంది. దీనికితోడు అధికార పార్టీ బీఆర్ఎస్‌లో ఉన్న అసంతృప్త నాయకులను కూడా కాంగ్రెస్‌లోకి వచ్చేలా చేసుకొని జనాల నాడీని తన వైపునకు తిప్పుకునేందుకు బాగా శ్రమించాలి. ఎందుకంటే ఈసారి లక్ష మెజార్టీతో గెలుస్తానని ధీమాతో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరిని ఢీకొట్టాలంటే శక్తియుక్తులు ప్రదర్శించాలి. ఇది చేయాలంటే పార్టీలోని ముఖ్యులను కలుపుకొని పోతేనే సాధ్యమవుతుందని కార్యకర్తలు అంటున్నారు.

పక్కా ప్రణాళిక ఉంటేనే..

ఇన్నాళ్లు అభ్యర్థి లేరని కాంగ్రెస్ నుంచి చాలామంది అధికార పార్టీ బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సర్వేలో కేఆర్ నాగరాజుకు పైచేయి ఉండడంతో అధిష్ఠానం ఆయనను ఫైనల్ చేసింది. నవంబర్ 30నే ఎన్నికలు ఉండడంతో ఇప్పటి నుంచే రూట్‌మ్యాప్ రెడీ చేసుకొని వర్ధన్నపేట నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను తిరగాల్సి ఉంది. ఈ సమయంలో ఇప్పటికే కాంగ్రెస్ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్లిన వారిని తిరిగి సొంతగూటికి తీసుకురావాల్సిన అవసరం ఉంది. అదేసమయంలో ఇతర పార్టీల వారిని కూడా లాగితే హస్తం పార్టీ గ్రాఫ్ పెరిగే అవకాశం ఉంటుంది. ఆరు గ్యారంటీలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అదే సమయంలో కాంగ్రెస్ నుంచి ఇతర పార్టీల వైపు చూస్తున్న నాయకులు, కార్యకర్తలను నిలువరించాల్సిన బాధ్యత కూడా కేఆర్ నాగరాజుపై ఉంది. దీంతో రానున్న రోజుల్లో రాజకీయం ఎలా ఉంటుందన్న చర్చ ఉంది.

క్యాంపస్ అంబాసిడర్లు సైనికుల్లా పనిచేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

- ఓటరు అవగాహన సదస్సులో కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: క్యాంపస్ అంబాసిడర్లు ఎన్నికలలో సైనికుల్లా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో క్యాంపస్ అంబాసిడర్లుగా గుర్తించిన విద్యార్థినీవిద్యార్థులతో శనివారం ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ కాలేజీలో బృందాలుగా ఏర్పడి అర్హులను ఓటరుగా చేర్పించాలని కోరారు. బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, మార్కెట్ పరిసరాల్లో ఫ్లాష్‌మాబ్ ద్వారా ఓటర్లలో అవగాహన కల్పించి ఓటింగ్ శాతం పెంచే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. గత ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గడానికి అర్బన్ యూత్ కారణమని తెలిపారు. మళ్లీ అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రజలు, యువకుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం మోడల్ పోలింగ్ స్టేషన్, యూత్ మేనేజ్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో వసతులు కల్పించినట్లు తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వారిపై సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని చెప్పారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్వీప్ నోడల్ అధికారి నరసింహమూర్తి, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్‌రావు, వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్

వరంగల్: ఏనుమాముల మార్కెట్ గోదాముల్లోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చిన ఈవీఎంలు, ఈవీప్యాట్‌లనుజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య శనివారం పరిశీలించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నియోజకవర్గానికి 20 చొప్పున మూడు నియోజకవర్గాలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కేటాయించారు.

కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లు పరిశీలన

ఏనుమాముల మార్కెట్‌లో 3 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఈవీఎం స్ట్రాంగ్ రూంల వద్ద విధులు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలతో కలెక్టర్ మాట్లాడుతూ గట్టి నిఘా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వరంగల్ ఆర్డీఓ వాసుచంద్ర, ఎలక్షన్ సూపరింటెండెంట్ విశ్వనారాయణ, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి టేబుల్ టెన్నిస్ పోటీలు

హసన్‌పర్తి: ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను ఆదివారం నుంచి రెండ్రోజుల పాటు నిర్వహించనున్నారు. కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు టేబుల్ టెన్నిస్ జిల్లా అధ్యక్షుడు ఆకారపు హరీశ్ తెలిపారు. అండర్-11, అండర్-13, అండర్-15, అండర్-17, అండర్-19 బాలబాలికల విభాగాలతో పాటు మహిళలు, పురుషుల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సింగిల్, డబుల్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని, ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా యువజన, క్రీడల అధికారి జి.అశోక్‌కుమార్, కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

పంటకాల్వల మరమ్మతులో విఫలం

- బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి గుండాల మదన్‌కుమార్



చైతన్య యాత్రలో మాట్లాడుతున్న గుండాల మదన్‌కుమార్

నల్లబెల్లి: గోదావరి జలాలను రంగాయ చెరువుకు తీసుకొచ్చిన నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పంట కాల్వలు, తూములను మరమ్మతు చేయించడంలో విఫలమయ్యారని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండాల మదన్‌కుమార్ విమర్శించారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన బహుజన చైతన్య యాత్రలో భాగంగా రెండో రోజు శనివారం మండలంలోని మేడపల్లి, రాంపూర్, కొండాపూర్ తదితర గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మదన్‌కుమార్ మాట్లాడుతూ సాగునీటి సమస్యతో సతమతమవుతున్న రంగాయ చెరువు ఆయకట్టు రైతుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. రైతు పక్షపాతి అని గొప్పలు చెప్పుకునే సీఎం కేసీఆర్ కౌలు రైతులకు రైతుబంధు, గిరిజన, గిరిజనేతర పోడు రైతులకు హక్కుపత్రాలు అందించాలని, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బహుజన రాజ్యం కోసం ప్రజలు బీఎస్పీకి మద్దతు ఇవ్వాలని, నర్సంపేట బీఎస్పీ ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మాసాని రమేష్, గజ్జి దయాకర్, బుర్రి సాగర్, హరీష్, వంటేరు రాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం అడుగులు వేయాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న ఐక్యవేదిక నాయకులు

నర్సంపేట: నర్సంపేట నియోజకవర్గంలో 45వేల అత్యధిక ఓటర్లు ఉన్న లంబాడీలు రాజ్యాధికారం కోసం ఐక్యంగా అడుగులు వేయాలని గిరిజన విద్యార్థి జాతీయ నాయకుడు, కాకతీయ యూనివర్సిటీ తెలంగాణ ఉద్యమకారుడు వినోద్‌లోక్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం నియోజకవర్గ నాయకుడు ధరావత్ సుభాష్‌నాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌లోక్‌నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అత్యధిక జనాభా ఉన్న లంబాడీ తండాలను ఏకం చేయాలని కోరారు. 'ఓటు హమారా సీట్ తుమారా నై చలేగా నై చలేగా' అనే కాన్షీరాం నినాదంతో త్వరలో ప్రకటించే గిరిజన నాయకత్వానికి అందరు లంబాడీలు మద్దతిస్తూ, బహుజన వాదాన్ని బలపరచాలని కోరారు. సమావేశంలో లంబాడీ ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు యాకస్వామినాయక్, ధరావత్ సుభాష్ నాయక్, జాతీయ నాయకులు కల్యాణ్‌నాయక్, ప్రశాంత్‌నాయక్, రాజేష్‌నాయక్, గౌతమ్‌నాయక్, వివేక్‌నాయక్, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

గురుకుల మహిళా కళాశాలలో రెండు పీజీ కోర్సులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ అండ్ పీజీ మహిళా కళాశాలలో (వరంగల్ వెస్ట్) ఈవిద్యాసంవత్సరం (2023-24)లో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్, ఎంఏ పొలిటికల్ సైన్స్ పీజీ కోర్సులు ప్రవేశపెడుతూ.. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, కాకతీయ యూనివర్సిటీ కూడా అనుమతినిచ్చిందని ఆకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.దయాకర్ తెలిపారు. సీపీ గేట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈమూడో దశలో ఆయా పీజీ అడ్మిషన్లలో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని విద్యార్థులను కోరారు. కళాశాలలో మౌలిక వసతులతోపాటు నాణ్యమైన విద్యాబోధనకు అర్హత అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారన్నారు. ఉచితంగా వసతి గృహ సౌకర్యంతోపాటు మెస్ సదుపాయం ఉందన్నారు. కాస్మోటిక్ చార్జెస్, ఫిజికల్ ఫిట్‌నెస్ జిమ్, లైబ్రరీ సౌకర్యం కూడా ఉందన్నారు.

పట్టుకున్న నగదును నమోదు చేయండి

కాజీపేట: ఆకస్మిక వాహన తనిఖీల్లో సీజ్ చేసిన బంగారం, నగదు, ఇతర వస్తువుల వివరాలు ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా పకడ్బందీగా రికార్డుల్లో నమోదు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో శనివారం రాత్రి జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. ఎన్నికల మార్గదర్శకాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్లు మహేందర్ జీ, అశ్విని తానాజీ, డీఆర్ఓ గణేశ్, డీసీపీ ఎంఏ బారి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : పెద్ది



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలు పనిచేయాలని పార్టీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులకు హంగులు ఆర్భాటాలు తప్ప వారికి నియోజకవర్గానికి సంబంధించిన ఎలాంటి అభివృద్ధి విజన్ లేదని ప్రజలకు స్పష్టంగా తెలుసని పేర్కొన్నారు. రైతు బంధు సమితి డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నం మొగిలి, బీఆర్ఎస్ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, గుంటి కిషన్, బత్తిని శ్రీనివాస్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు పెంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే

దివ్యాంగులకు పింఛన్లు పెంచిన ఘనం బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని పార్టీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం దివ్యాంగుల ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులను ఏనాడూ గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని తెలిపారు. రూ.4వేలు ఇచ్చి ఆత్మ గౌరవాన్ని పెంచినట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు తనను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. దివ్యాంగుల పింఛన్ రూ.4వేలకు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు.

వేయిస్తంభాల ఆలయంలో ద్వార బంధనం



ఆలయ తలుపులు మూసేస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్: చంద్రగ్రహణం కారణంగా వేయిస్తంభాల దేవాలయాన్ని శనివారం ద్వారబంధనం చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి వారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు గర్భాలయం ద్వార బంధనం చేశారు. తిరిగి ఆదివారం ఉదయం 5గంటలకు సంప్రోక్షణలు, పూజలు నిర్వహించి ఆలయాన్ని భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఈఓ వెంకటయ్య తెలిపారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కాజీపేట: ఒకరి రక్తదానంతో మరో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని, ప్రతి వ్యక్తి స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకల సందర్భంగా రక్తదన శిబిరాన్ని సీపీ ప్రారంభించారు. రక్తదానం చేసి పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 125 మంది రక్తదానం చేయగా.. ప్రశంస పత్రాలను అందించారు. ఎంజీఎం ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్త యూనిట్లను సేకరించారు. క్రైమ్స్ డీసీపీ దాసరి మురళీధర్, అదనపు డీసీపీలు సంజీవ, సురేశ్‌కుమార్, రాగ్యానాయక్, రామకృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే వాట్సాప్ చేయండి

కాజీపేట: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతలకు సంబంధించి సమస్యలుంటే నేరుగా వాట్సాప్ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలని సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. శనివారం వరంగల్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే పరిస్థితుల్లేని కారణంగా 87126-85257 నంబర్‌కు లేదా 100 డయల్‌కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. వీటి ద్వారా వచ్చిన దరఖాస్తుల్ని పరిశీలించి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు సమాచారం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారులకు తగు న్యాయం జరిగేలా పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి..

- ఎరియర్స్ ఒకే విడతలో నగదు రూపంలో చెల్లించాలి
- 'సాక్షి' 'పీపుల్స్ ఎజెండా'లో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల స్పష్టీకరణ

జనరల్ టు ఎస్టీ రిజర్వ్..

- 1972 వరకు ములుగు జనరల్.. 1978లో ఎస్టీకి కేటాయింపు

- వివరాలు 10లో▸

ఎన్నికల శిక్షణ కేంద్రం ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న షేక్‌రిజ్వాన్‌బాషా

వరంగల్ అర్బన్: వరంగల్ తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఈనెల 31 (మంగళవారం) నుంచి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి, గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. వరంగల్ ఎల్‌బీ కళాశాలలో ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సిల్దార్ నాగేశ్వర్‌రావు, మాస్టర్ ట్రైనర్ సందీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించండి

వరంగల్ అర్బన్/ఖిలా వరంగల్: నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలని వరంగల్ (తూర్పు) నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధి గవిచర్ల క్రాస్‌రోడ్, నాయుడు పెట్రోల్ బంక్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ.. మోడల్ కోడ్‌ను కచ్చితంగా పాటించాలన్నారు. నగదు, ఇతర వస్తువులు సీజ్ చేసేటప్పుడు తప్పకుండా పంచనామా చేస్తూ మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయాలని, అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఈ తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ హెడ్ బీఎల్ శ్రీనివాసరావు, సిబ్బంది యాదగిరి, ఫణి తదితరులు ఉన్నారు.

తమ బలాలు, బలహీనతలు నాయకులకు తెలుసు. మంచినాయకుడు బలహీనతలు వదిలేస్తాడు. బలాలను పెంచు కుంటాడు.

- వారెన్‌బెన్నీస్



ఈసీ టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు



జనగామ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 1950 కాల్ సెంటర్

జనగామ: ఓటర్ల వ్యక్తిగత సమాచారం, పోల్ సంబంధిత ఫిర్యాదులు, ఇతర సమస్యలు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లేందుకు ఎలక్షన్ కమిషన్ టోల్ ఫ్రీ నంబర్–1950 అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్రామాల వారీగా పోలింగ్ స్టేషన్లు, బూత్‌లెవల్ అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సంబంధించిన వివరాలు హెల్ప్ లైన్ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఓటు.. వజ్రాయుధం



ఓటు హక్కు వినియోగంపై శనివారం బాలసముద్రంలోని ఏకశిల పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని హనుమకొండ ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు.

- హన్మకొండ

జంగ్ తెలంగాణ

ప్రచారంలో 'పరీక్ష'..



బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ శనివారం కాజీపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో ఓ ఆర్ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా బీపీ పరీక్షించుకున్నారు.

సోషల్ 'వార్'..

తొర్రూరు: ఎన్నికల వేళ టెక్నాలజీ వినియోగం విస్తృతంగా పెరిగిపోతోంది. సోషల్ మీడియాలో వాట్సాప్, ఎక్స్ (ట్విట్టర్), ఫేస్‌బుక్‌లో పార్టీ ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం ఓటర్లకు విసుగు తెప్పిస్తోంది. గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో నాయకులు వారికి తెలిసిన నంబర్లతో గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. ఏదైనా ఒక పార్టీకి చెందిన వాట్సాప్ గ్రూపులో ఓ వ్యక్తిని యాడ్ చేస్తే అతను ఇష్టం ఉన్నా.. లేకున్నా మొహమాటంతో పోస్టులు చూడలేక, చదవలేక సతమతమవుతున్నాడు. పొరపాటున ఎగ్జిట్ అయితే వారు తమ పార్టీ మనిషి కాదని భావించే అవకాశం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఒకే గ్రూపులోనే పార్టీకి అనుకూలంగా వ్యతిరేకంగా పోస్టులు సెండ్ చేస్తుండడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. ఏదీ ఏమైనా ఈ ఎన్నికల సీజన్‌లో వాట్సాప్ లొల్లితో ఓటర్లకు తిప్పలు తప్పడం లేదు.

సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి..





సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అందించాలి

- ఎరియర్స్ ఒకే విడతలో నగదు రూపంలో చెల్లించాలి
- 'సాక్షి' పీపుల్స్ ఎజెండా'లో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల స్పష్టీకరణ

సాక్షి 'పీపుల్స్ ఎజెండా'

రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు కోరారు. తెలంగాణ శాసన సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'పీపుల్స్ ఎజెండా'లో వారు తమ డిమాండ్లను రాబోయే ప్రభుత్వాల ముందుంచారు. తమ పెన్షన్ నుంచి నెలకు ఒక్క శాతం చెల్లిస్తామని, తమకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెష్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీనే పెన్షన్ చెల్లించాలని, గత పీఆర్ఎస్, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. చేతనైన సమయంలో జీవితం మొత్తం ఉద్యోగం కోసం వెచ్చించామని, విరమణ చేసి విశ్రాంతి తీసుకున్న తమ సంక్షేమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

- హన్మకొండ

నగదు రహిత వైద్యం అందడం లేదు



కార్పొరేట్ ఆసుపత్రుల్లో డబ్బు లేకుండా వైద్య అందడం లేదు. హెల్త్ స్కీమ్ ఏర్పాటు చేసి మాకు ప్రతి ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

- ఎస్ సోమయ్య, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు

మొదటి తేదీన పెన్షన్ ఇవ్వాలి



కొన్ని సంవత్సరాల నుంచి ప్రతి నెల 6 నుంచి 15వ తేదీ మధ్యలో పెన్షన్ అందజేస్తున్నారు. అలాకాకుండా ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలి. ఆరు నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన డీఏలు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యలు పరిష్కరించి మమ్ములను ఆదుకోవాలి

- ఏ.సత్యనారాయణ, రిటైర్డ్ ఎస్‌టీఓ, సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి

సచివాలయంలోకి అనుమతించడం లేదు



మా సమస్యలు వివరిద్దామని రాష్ట్ర సచివాలయానికి వెళ్తే అనుమతించకుండా సీనియర్ సిటిజన్లను అవమానపరుస్తున్నారు. నిత్యావసరాల ధరలు అదుపు చేయకుండా ప్రభుత్వాలు మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి ధరలు నియంత్రించి సామాన్యులకు ఊరటనివ్వాలి.

- పగడాల సరళ, రిటైర్డ్ ఉద్యోగి

కార్పొరేషన్ ఆవరణలో సబ్‌ట్రెజరీ ఆఫీస్ కొనసాగించాలి



నాలుగు సంవత్సరాల క్రితం వరంగల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సబ్ ట్రెజరీ ఆఫీస్ ఉండేది. జిల్లాల విభజన తర్వాత హనుమకొండకు మార్చారు. తద్వారా వరంగల్ జిల్లాలోని సుమారు 7వేల మంది పెన్షనర్లం హనుమకొండకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం.

- మహ్మద్ నిజామొద్దీన్, రిటైర్డ్ ఎంఈఓ, సంఘం వరంగల్ సిటీ అధ్యక్షుడు

పైరవీ చేసిన వారికే పెండింగ్ బిల్లులు



మా బకాయిల గురించి నిత్యం ట్రెజరీ చుట్టు తిరిగినా రావడం లేదు. పైరవీల ద్వారా వెళ్లిన వారికే వస్తున్నాయి. నేరుగా వెళ్తే పని కావడం లేదు. మా సమస్యలు చెప్పుకోవడానికి జిల్లాల వారీగా టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలి. ప్రతీ జిల్లా కేంద్రంలో పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా ట్రెజరీ ఆఫీస్‌ను ఏర్పాటు చేయాలి.

- మంత్రి సతీష్, రిటైర్డ్ ట్రెజరీ అధికారి


పెన్షనర్ల సంఘానికి భవనం నిర్మించి ఇవ్వాలి



రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో పెన్షనర్లు, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కోసం స్థలం కేటాయించి, భవనం నిర్మించాలి. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలి. వెల్‌నెస్ సెంటర్లలో సీనియర్ డాక్టర్లను నియమించి మందులు కొరత లేకుండా చూడాలి. ఓపీ రిజిస్ట్రేషన్ సమయంలో నెలకొన్న ఇబ్బందులు తొలంగించాలి. అలాగే, ప్రతి ఒకటవ తేదీనే పింఛన్ అందజేసి ఆదుకోవాలి.

- సంజీవరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి

రీయింబర్స్‌మెంట్ రావడం లేదు



హెల్త్ స్కీం అమలుకు నోచుకోకపోవడంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం కోసం డబ్బు చెల్లించాల్సి వస్తోంది. వైద్యం పూర్తయ్యాక రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుంటే సకాలంలో అందక ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. బా బేసిక్‌పే నుంచి ఒక్క శాతం కట్ చేసుకుని హెల్త్‌స్కీం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. డీఏ, ఇతర బకాయిలు వాయిదాల పద్ధతిలో కాకుండా ఒకేసారి నగదు రూపంలో చెల్లించాలి.

- ఎంఏ జలీల్, రిటైర్డ్ ఉద్యోగి

వెల్‌నెస్ సెంటర్లలో ల్యాబ్ పరీక్షలు చేయాలి



వెల్‌నెస్ సెంటర్లలోని ల్యాబ్‌లో 60 రకాల పరీక్షలు చేస్తామన్నారు. కానీ ఒక్క పరీక్ష కూడా చేయడం లేదు. వ్యాధి తీవ్రత కోసం నిర్ధారణ పరీక్షలు చేయకపోవడంతో ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సి వస్తోంది. వైద్యులు కూడా ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు ఉంటారో తెలియడం లేదు. అనుభవం కలిగిన డాక్టర్లతో పాటు మందుల కొరత లేకుండా చూడాలి. ల్యాబ్ పరీక్షలు అన్నింటినీ చేసేలా వసతులు కల్పించాలి.

- కె.రాజశేఖరయ్య, రిటైర్డ్ దేవాదాయశాఖ ఉద్యోగి

ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలి



రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆదాయ పన్ను నుంచి మినహాంపు ఇవ్వాలి. ఏటా ఆదాయ పన్ను ప్రతిపాదనలు పంపమనడంతో ఇబ్బందులు పడుతున్నాం. రైలులో ప్రయాణించేందుకు గతంలో రాయితీ ఉండేది. దానిని రద్దు చేశారు. ప్రస్తుతం ఆ రాయితీని పునరుద్ధరించాలి. ఉద్యోగులకు జీతాలతో పాటు పెన్షనర్లకు కూడా నెలలో మొదటి తేదీన పింఛన్ ఇవ్వాలి.

- చందుపట్ల నిరంజన్‌రావు, రిటైర్డ్ ఉద్యోగి

డీఏ, పీఆర్సీ చెల్లించాలి




ఆరు నెలల్లో మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. మాకు రావాల్సిన డీఏ, పీఆర్సీని వాయిదాల పద్ధతిలో చెల్లించడం బాధాకరం. మునుపెన్నడూ ఇలా వాయిదాల పద్ధతిలో డీఏలు ఇవ్వలేదు. పెన్షనర్ల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి డీఏ, బీఆర్సీ, బకాయి బిల్లులు ఒకే విడతలో చెల్లించాలి. అప్పుడే మా కుటుంబాల ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి.

- ఇ.శేషయ్య, రిటైర్డ్ ఉద్యోగి

జనరల్ టు ఎస్టీ రిజర్వ్..

1972 వరకు ములుగు జనరల్.. 1978లో ఎస్టీకి కేటాయింపు

- 1952లో ఏర్పడిన నియోజకవర్గ ప్రస్థానం ఇదీ..
- ఎక్కువ సార్లు గెలిచిన పార్టీలు కాంగ్రెస్, టీడీపీ
- 50,079 నుంచి 2,20,886 వరకు పెరిగిన ఓటర్లు
- కీలకంగా మారనున్న మహిళా ఓట్లు




చందూలాల్


సీతక్క


వీరయ్య


భోజారావు

ములుగు: ములుగు నియోజకవర్గంలో 1952లో తొలిసారి శాసన సభ ఎన్నికలు జరిగాయి. ఇందులో పీడీఎఫ్(పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్) తరఫున హనుమంతరావు, కాంగ్రెస్ తరఫున రాజ్యలక్ష్మీ పోటీ చేశారు. ఇందులో రాజ్యలక్ష్మీకి కేవలం 6,540 ఓట్లు మాత్రమే వచ్చాయి. పీడీఎఫ్ అభ్యర్థి హనుమంతరావుకు 7,132 పోలై ములుగు తొలి ఎమ్మెల్యేగా రికార్డుల్లోకి ఎక్కారు. 1972 వరకు ములుగు జనరల్‌గా ఉంది. ఎస్టీ జనాభా ఎక్కువ ఉండడంతో డిలిమిటేషన్‌లో భాగంగా 1978లో ఎస్టీ రిజర్వ్‌గా మారింది.

ఎక్కువ సార్లు గెలిచిన పార్టీలు కాంగ్రెస్, టీడీపీ

ములుగు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీలే ఎక్కువసార్లు గెలుపొందాయి. కాగా టీడీపీ ప్రభుత్వంలో అజ్మీర చందూలాల్, పోరిక జగన్నాయక్ రెండు సార్లు మంత్రులుగా కొనసాగారు. ఇక 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అజ్మీర చందూలాల్.. కాంగ్రెస్ అభ్యర్థి సీతక్కపై 18,884 ఓట్లతో గెలుపొందారు. అనంతరం 2018 ఎన్నికల్లో ఏకంగా సిట్టింగ్ మంత్రి చందూలాల్‌పై 22,671 ఓట్లతో గెలుపొందారు.

భారీగా పెరిగిన ఓటర్లు..

1952 మొదలు.. 2023 సంవత్సరం వరకు 71 సంవత్సరాల్లో నియోజకవర్గ ఓటర్ల సంఖ్య భారీగా పెరుగుతూ వచ్చింది. 1952తొలి ఎన్నికల్లో 50,076 మంది ఓటర్లు మాత్రమే ఉండగా 1985లో తొలిసారి 1,09,680 మొదటిసారి లక్ష సంఖ్య దాటింది. 1999లో 1,61,863 వరకు వచ్చింది. ఇక 2014లో రెండు లక్షలు దాటింది. ప్రస్తుతం నియోజకవర్గంలో 2,20,886 మంది ఓటర్లు ఉన్నారు.

ప్రభావం చూపనున్న మహిళా ఓటర్లు

2009 నుంచి ములుగు నియోజకవర్గంలో మహిళా ఓటర్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ సాధారణ ఎన్నికల్లో 1,08,588 మంది పురుషులు, 1,12,277 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించనున్నారు. ఈ లెక్కన నియోజకవర్గంలోని 10 మండలాల్లో (మల్లంపల్లి నూతన) 3,089 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు.

2009లో మారిన నియోజకవర్గ ముఖచిత్రం

2009 సాధారణ శాసనసభ ఎన్నికల్లో ఒక్కసారి ములుగు నియోజకవర్గ ముఖచిత్రం పూర్తిగా మారింది. గతంలో నియోజకవర్గంలో ఉన్న గణపురం అలాగే కొనసాగితే ములుగు జనరల్ అయ్యే అవకాశం ఉండేది. అదే విధంగా ప్రస్తుత మహబూబాబాద్ జిల్లాలో ఉన్న కొత్తగూడను నర్సంపేట నియోజకవర్గంలో కొనసాగిస్తే నర్సంపేట సైతం ఎస్టీగా కొనసాగేది. అయితే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ములుగు ఎమ్మెల్యే పొదెం వీరయ్య అంతర్గతంగా సమావేశమై పరిస్థితిని తారుమారు చేశారు. రిజర్వేషన్లు మారకుండా నల్లబెల్లిని నర్సంపేటలో, కొత్తగూడను ములుగులో, గణపురం(ఎం)ను జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కలిపారు. దీంతో ములుగు ముఖచిత్రం మారి ఎస్టీ రిజర్వ్ అయింది.



ములుగు నియోజకవర్గ కేంద్రం

నియోజకవర్గంలో పోటీ చేసిన వారి వివరాలు

సంవత్సరం	గెలుపొందిన పార్టీ	అభ్యర్థి	సమీప అభ్యర్థి	పోలైన ఓట్లు
1952	పీడీఎఫ్	హనుమంతరావు	రాజ్యలక్ష్మీ(కాంగ్రెస్)	23,869
1957	పీడీఎఫ్	రాజేశ్వర్‌రావు	కులు(కాంగ్రెస్)	28,865
1962	కాంగ్రెస్	కృష్ణయ్య	ప్రసాద్(సీపీఐ)	39,141
1967	ఇండిపెండెంట్	సంతోశ్ చక్రవర్తి	రామనర్సయ్య(సీపీఎం)	52,379
1972	కాంగ్రెస్	సంతోశ్ చక్రవర్తి	రావు(ఇండిపెండెంట్)	66,755
1978	కాంగ్రెస్	జగన్నాయక్	భోజరావు(జనతా)	64,320
1983	కాంగ్రెస్(ఐ)	జగన్నాయక్	అజ్మీర చందూలాల్(టీడీపీ)	64,474
1985	టీడీపీ	చందూలాల్	జగన్నాయక్(కాంగ్రెస్)	74,599
1989	కాంగ్రెస్	జగన్నాయక్	చందూలాల్(టీడీపీ)	1,02,475
1994	టీడీపీ	చందూలాల్	జగన్నాయక్(కాంగ్రెస్)	1,13,849
1996	టీడీపీ	భోజారావు	జగన్నాయక్(కాంగ్రెస్)	-
1999	కాంగ్రెస్	వీరయ్య	చందూలాల్(టీడీపీ)	1,15,227
2004	కాంగ్రెస్	వీరయ్య	సీతక్క(టీడీపీ)	1,18,383
2009	టీడీపీ	సీతక్క	పొదెం వీరయ్య(కాంగ్రెస్)	1,34,674
2014	బీఆర్ఎస్	చందూలాల్	సీతక్క(టీడీపీ)	-
2018	కాంగ్రెస్	సీతక్క	చందూలాల్(బీఆర్ఎస్)	1,68,780